క్లుప్తంగా

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



పాన్‌గల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏపీఓ కుర్మయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని మాందాపూర్, దావాజీపల్లి గ్రామాల్లో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి వాటిని సంరక్షిస్తే అవి మనల్ని కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు సజ్జనార్‌కు ఆహ్వానం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9నుంచి ప్రారంభమయ్యే 18వ వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జనార్‌ను గురువారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సజ్జనార్ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

అందుబాటులో జీలుగ, వరి విత్తనాలు



పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు అవసరమగు జీలుగ, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈఓ భాస్కర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీజీ (5204) వరి విత్తనాలు 25 కేజీల బస్తా ధర రూ.1138, జీలుగ 30 కేజీల బస్తా ధర రూ.2138, కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో కార్యాలయంలో సంప్రదించి విత్తనాలు పొందవచ్చని పేర్కొన్నారు.

పండుగ పూట విషాదం

ఆత్మకూర్: పట్టణంలో మూడురోజులుగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా గురువారం వేడుకలను తిలకించేందుకు వచ్చిన ఓవ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వనపర్తిలోని రాయిగడ్డకు చెందిన మహేష్(35) ఆత్మకూర్‌లోని తన సమీప బంధువైన డ్రైవర్ శ్రీను ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి పండుగకు వచ్చాడు. దైవ దర్శనం చేసుకున్న మహేష్ ఇంటికి చేరుకున్న అనంతరం ఛాతీలో నొప్పి కారణంగా పడిపోయాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

నేటి నుంచి బడిబాట



పాన్‌గల్: చదువుకు దూరమైన పిల్లలను బడుల్లో చేర్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కార్యచరణ ఇలా..

బడిబాటలో భాగంగా బాల కార్మికులు, బడి బయట పిల్లలు, అనాథలు, అంగన్‌వాడీ చిన్నారులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోనున్నారు. కేంద్రాల నుంచి చిన్నారులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా అవగాహన కల్పించి ప్రభుత్వ బడుల్లోనే చేర్పించడంపై అవగాహన కల్పించనున్నారు. అంతేకాక 'మనబడి' అంటూ గ్రామస్తులను భాగస్వాములను చేయనున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. పాఠశాలల్లోని సౌకర్యాలు, విద్యావిధానంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, ఎంఈఓ. పాన్‌గల్

పర్యావరణాన్ని కాపాడుదాం



కొత్తకోటలో మొక్కలు నాటుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, కమిషనర్ సైదయ్య

కొత్తకోట రూరల్: పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే పర్యావరణ పరిరక్షణకు మార్గమని మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తకోట మున్సిపల్ కమిషనర్ సైదయ్య ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షణ్' కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సైదయ్య, మేనేజర్ రవీందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.కృష్ణారెడ్డి, ఎన్‌జే బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, పెంటన్నయాదవ్, సంద వెంకటేశ్, శ్యామ్, మున్సిపాల్ సిబ్బంది వెంకటయ్య, శ్రీధర్, వార్డ్ అధికారులు, ఆర్పీలు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధిద్దాం

కొత్తకోట రూరల్: కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగెం సైదయ్య ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు డా.జి.విద్య, కె.భాస్కర్ పర్యవేక్షణలో 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని జయిద్దాం' అనే అంశాన్ని తీసుకొని ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రొఫెసర్లు నీటి ఎద్దడిని తట్టుకొని ఎలాంటి వాతావరణంలో అయినా ఎదిగి కాపునిచ్చే కరోండా (వాక్కాయ) మొక్కలను నాటారు. ఈ మొక్కలు ప్రధానంగా జీవకంచెగాను, పచ్చళ్లకు ఉపయోగపడతాయని, అధిక సీ–విటమిన్, ఇనుము కలిగి ఉంటాయని ప్రొఫెసర్లు తెలిపారు. క్యాంపస్‌లోని బాలుర, బాలికల వసతి గృహాల్లో, కళాశాల ఆవరణలోని ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు, ప్రొఫెసర్లు పోగుచేసి వాటి కారణంగా జరిగే నష్టాల గురించి, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి వరకు పర్యావరణ పరిరక్షణకు ప్లకార్డులను పట్టుకుని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జె.శ్రీనివాస్, డాక్టర్ గౌతమి, టీచింగ్ అసోసియేట్ డాక్టర్ రవళి, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

అమరచింత: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ చెన్నమ్మ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చింతరెడ్డిపల్లె గ్రామంలో మొక్కలు నాటి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు పంచాయతీ కార్యదర్శి శివ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో..

పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట తిరుగుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదాలతో మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఇసూఫ్, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురంలో గురువారం గ్రామస్తులతో కలసి పంచాయతీ కార్యదర్శి రమాదేవి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



చింతరెడ్డిపల్లెలో మొక్కను నాటి నీరు పోస్తున్న ఎంపీడీఓ.



అమరచింతలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు

ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగించాలి



పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ఖిల్లాఘనపురం: ప్రజలకు నమ్మకం కలిగేలా ఖిల్లాఘనపురం పోలీసులు వ్యవహరించడం అభినందనీయమని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరిపల్లిలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరైన ఆయన ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన రికార్డులు పరిశీలించారు. మండలంలో ఇటీవల తరుచుగా జరుగుతున్న దొంగతనాలను చేధించి తక్కువ సమయంలో వస్తువులను రికవరీ చేయడంపై ఎస్సై సురేష్‌గౌడ్, సిబ్బంది లింగం, రాజు, చైతన్యకుమార్, మునావర్‌ను ఆయన అభినందించారు. అందరూ కలికట్టుగా పనిచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. రాత్రివేళల్లో మండల కేంద్రంతో పాటుగా గ్రామాల్లో పెట్రోలింగ్ చేపడుతూ ఎక్కడ దొంగతనాలు, నేరాలు జరగకుండా చూడాలన్నారు.

రైతువేదికలో జరిగిన దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు



దొంగలను చూపిస్తున్న ఎస్‌ఐ సురేష్‌గౌడ్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని రైతువేదికలో మే 29న రాత్రివేళలో జరిగిన దొంగతనాన్ని పోలీసులు చేధించారు. వీసీ యూనిట్‌కు సంబంధించిన సీపీయూ, మానీటర్, కీ బోర్డు తదితర సామన్లు అపహరించిన దొంగలను ఎస్‌ఐ సురేష్‌గౌడ్ పట్టుకొని మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం మండలంలోని తిర్మలాయపల్లి గేట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఆటోలో ప్రయాణిస్తూ అనుమానాస్పదంగా వ్యవహరించిన మాధవులు, మన్యమయ్య, నాగార్జునను పట్టుకొని విచారణ చేయగా.. దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఈ మేరకు సిబ్బంది లింగం, రాజు, చైతన్యకుమార్, ఎండీ మునావర్ ను ఎస్పీ, డీఎస్పీ, సీఐలు అభినందించారు.

పోషమ్మ తల్లీ పాహిమాం..



ఆత్మకూర్: పట్టణంలో పునర్నిర్మించిన పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వస్తిశ్రీ విశ్వాసు నామ సంవత్సరం జ్యేష్ఠశుద్ధ దశమి ఉదయం 5 గంటల నుంచి ప్రాతఃపూజలు, గర్తన్యాసములు, ప్రతిష్ఠాంగహోమం, ఉదయం 7.56 గంటలకు యంత్ర, విగ్రహాల ప్రతిష్ఠ తదితర పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే, ఎస్పీ ప్రత్యేక పూజలు

ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ రావుల గిరిధర్‌తో పాటు పలువురు ప్రముఖులు పోషమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి 100 రోజుల కార్యచరణను రూపొందించి ముందుకెళ్తున్నామని, అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. గురువారం పట్టణంలో పర్యటించి, పారిశుద్ధ్యం, వనమహోత్సవం, ఇంకుడుగుంతల నిర్మాణాలు, తదితర విషయాలపై పట్టణవాసులకు అవగాహన కల్పించారు.

నిర్యుద్యోగులకు ఉచిత శిక్షణ

వనపర్తి రూరల్: ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పిస్నామని జిల్లా కోర్డినేటర్ ప్రమీల, జయప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సోలార్, ఎలక్ట్రీషియన్, డాటా ఎంట్రీ ఆపరేటర్, నర్సింగ్, కారు మెకానిక్, హోటల్ మేనేజ్‌మెంట్, తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. శిక్షణ పొందే మహిళలు, పురుషులకు వేరు వేరుగా ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పాస్ అయిన వారు ఈ నెల 10న ఉదయం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు. మిగితా వివరాల కోసం సెల్ నంబర్ 76718 44901 ను సంప్రదించాలని కోరారు.

ఆధునిక వ్యవసాయంతో లాభాలు



మస్తీపురంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త



కమాలోద్దీన్‌పూర్‌లో..

ఆత్మకూర్: రైతులు ఆధునిక వ్యవసాయం వైపు దృష్టి సారించాలని, అప్పుడే అధిక దిగుబడులు సాధ్యమవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్, సురేష్‌కుమార్ అన్నారు. గురువారం వికసిత్‌సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు మేడేపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. వానాకాలం పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు ఎంపిక, పచ్చిరొట్టి ఎరువులను వాడకం, వరికొయ్యలను భూమిలో కలియ దున్నడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.

ఖిల్లాఘనపురం: ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మాధురి, డాక్టర్ మహేశ్వరి సూచించారు. గురువారం కమాలోద్దీన్‌పూర్‌లో ఏఓ మల్లయ్యతో కలిసి వానాకాలం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ పవన్‌కళ్యాణ్, లక్ష్మి పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగుపై దృష్టి

అమరచింత: ఒకే రకమైన వ్యవసాయ పంటల సాగు చేయడం వల్ల భూములు సారం కోల్పోయే ప్రమాదం ఉందని, పంటల సాగులో నూతన ఒరవడితో ఇతర పంటల సాగుకు చొరవ చూపాలని జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ తెలిపారు. మండలంలోని మస్తీపురం, నందిమళ్ల గ్రామాల్లో వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు నూనె గింజల పంట సాగుపై అవగహన కల్పించారు. రైతులు సాగు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తమకు చెప్తే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. నూనె గింజలను విత్తుకొనే రైతులు ఐసీహెచ్–5 అనే హైబ్రిడ్ ఆముదం రకం ఉందని, తక్కువ కాల పరిమితి కలిగి ఉండి అధిక దిగుబడి తీసుకోవడానికి వీలుంటుందన్నారు. ఈ విత్తనం మదనాపురంలోని కేవీకే సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పర్యావరణం కాపాడుకోనేందుకు రైతులు రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయాలని కోరారు. అనంతరం మొక్కలు నాటారు. వెటర్నరీ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి, లంపి స్కిన్, గొర్రెలు, మేకల్లో వచ్చే వ్యాధులను ఎలా నివారించుకోవాలనే విషయాలను పాడి రైతులకు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అనిత, ఏఓ అరవింద్, ఏఈఓ శివ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం



విద్యార్థి సన్మానంలో ఎంఈఎఫ్ సంఘం నాయకులు

పాన్‌గల్: జేఈఈ 2025 అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియాలో ఎస్ కేటగిరిలో 385వ ర్యాంక్ సాధించి మొదటి దశ కౌన్సిలింగ్‌లోనే సీటు సాధించిన గోప్లాపూర్ గ్రామానికి చెందిన వెంకటమ్మ, నరసింహ దంపతుల కుమారుడు చరణ్‌ను గురువారం ఎంఈఎఫ్ ఉద్యోగ సంఘాల నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ ఉద్యోగ సంఘాల నాయకులు బాల సాహితీవేత్త కిరణ్‌కుమార్, గద్వాల కృష్ణ మాట్లాడారు. చదువుకోవడానికి పేదరికం అడ్డు కాదని పట్టుదల, కృషి ఉంటే ఎలాంటి సామాజిక నేపథ్యం ఉన్నా తాము అనుకున్న రంగాల్లో విజయం సాధించవచ్చునని విద్యార్థిని నిరూపించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటయ్య, భగవంతు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులు వేగంగా చేపట్టండి



అప్పాయిపల్లిలో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న ఎంపీడీఓ రాఘవ

అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఆదర్శ గ్రామంగా ఎంపికైన గ్రామంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ చెన్నమ్మ అన్నారు. మండలంలోని చింతరెడ్డి పల్లిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామానికి 22 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు ఐదుగురు లబ్ధిదారులు మాత్రమే నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు అధికారులు సూచించిన విధంగా నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. పునాది వేస్తే రూ.లక్ష వస్తాయని, ఆ తర్వాత చెత్తు వరకు గోడలు నిర్మిస్తే మరో రూ.లక్ష బిల్లు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని అప్పాయిపల్లిలో మొదటి విడతలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీఓ రాఘవ గురువారం సందర్శించి, వేగంగా పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి పనులు మొదలుపెట్టని లబ్ధిదారులను గుర్తించి వారితో సమావేశం నిర్వహించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది లబ్ధిదారులతో మాట్లాడి, ముగ్గు పోసినట్లు తెలిపారు. అలాగే పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీంద్రబాబు, కార్యదర్శి నర్మద, క్షేత్ర సహాయకుడు రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం తహసీల్దార్ వరలక్ష్మి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 47 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. వీపనగండ్లకు 8, గోవర్ధనగిరి 6, సంగినేనిపల్లి 6, కల్వరాల 8, బొల్లారం 3, తూముకుంట 4, గోపాల్‌దిన్నె 4, కొర్లకుంట 3, వల్లాభాపురం గ్రామంలో ముగ్గురికి చెక్కులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, వెంకటేష్, చిన్నారెడ్డి, రవీందర్‌రెడ్డి, యాదయ్య, గోపి, రాజశేఖర్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోండి



జమ్మాపూర్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా గురువారం రెవెన్యూ సదస్సులను కొనసాగించారు.

★ ఆత్మకూర్ మండలంలోని గుంటిపల్లి, జూరాల గ్రామాల్లో 28 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా, డీటీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

★ అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో 10 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ రవికుమార్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐలు వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

★ కొత్తకోట మండలంలోని పామాపురంలో సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వాసు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

★ మదనాపురం మండలంలోని గోవిందహళ్లిలో నిర్వహించిన సదస్సులో 21 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జేకే మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజేశ్వరి, సర్వేయర్ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

★ వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి 34 దరఖాస్తులు, చందాపురంలో డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి 39 దరఖాస్తులు స్వీకరించారు. పెబ్బేరు మండలంలోని రంగాపురంలో తహసీల్దార్ మురళీగౌడ్ 23, పెంచికలపాడులో డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ 5 దరఖాస్తులు స్వీకరించారు. శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో తహసీల్దార్ బి రాజు 24 భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు కె మధు, వెంకటేష్, రాధాకృష్ణ, రాఘవేంద్రరావు, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

★ పాన్‌గల్ మండలంలోని జమ్మాపూర్‌లో 4, మాందాపూర్‌లో 8 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సత్యానారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



గోప్లాపూర్‌లో విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం



మిట్టనందిమళ్లలో ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న భక్తులు

అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్ల పాటిమీద ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. పూజల్లో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డితో పాటు మాజీ సర్పంచ్ సర్వారెడ్డి, శశిధర్‌రెడ్డి, లాల్‌కోట వెంకటన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శరత్ రెడ్డి పాల్గొని ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు అశేషంగా తరలొచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. గ్రామ ఆడపడుచులకు చీరసారెలను పెట్టి తమ ఆచార సంప్రదాయాలను చాటుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ పరిసరాల్లో ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోప్లాపూర్‌లో..

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహాపూజ కార్యక్రమాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో వేదపండితుల సమక్షంలో మొదటి రోజు మహాగణపతి పూజ, గోపూజ, యాగశాల, మండప పూజలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల్లో పాల్గొనే భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.